క్లుప్తంగా

జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహా రెడ్డికి ఉత్తమ సేవా పురస్కారం



లక్ష్మీపురం: కస్టమ్స్, జీఎస్టీ అప్పీల్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డికి కేంద్ర ప్రభుత్వం నుంచి అరుదైన గౌరవం లభించింది. జీఎస్టీ దినోత్సవం సందర్భంగా ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన సినీ హీరో నాగార్జున చేతుల మీదుగా నరసింహారెడ్డి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు.

మోకీలుకు ఆధునిక శస్త్రచికిత్స



గుంటూరు మెడికల్: మోకీలు సమస్యలతో బాధపడేవారికి అత్యాధునిక శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలతో పూర్తి ఉపశమనం లభిస్తుందని ప్రముఖ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, కిమ్స్ శిఖరా హాస్పిటల్ చీఫ్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ కొల్లి జయకిషన్ అన్నారు. ది రూరల్ మెడికల్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మంగళదాస్‌నగర్‌లోని కిమ్స్ శిఖరా హాస్పిటల్‌లో విజయవంతంగా నూరు మోకీలు మార్పిడి ఆపరేషన్లు చేసినందుకు డాక్టర్ కొల్లి జయ కిషన్‌ను ఘనంగా సన్మానించారు. తమ హాస్పటల్‌లో అత్యాధునిక కార్పొరేట్ వైద్య సేవలను నామమాత్రపు ఫీజులతో అందిస్తున్నామని, ప్రజలు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గల్లా మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కర్రలతో యువకుడిపై దాడి

లక్ష్మీపురం: నిత్యం ఓ యువతితో మాట్లాడుతున్నాడని ఓ యువకుడిపై కొందరు కర్రలతో దాడి చేసి గాయపరిచారు. దీనిపై అరండల్‌పేట పోలీసులు శుక్రవారం రాత్రి కేసు నమోదు చేశారు. గుంటూరు కోబాల్ట్‌పేటకు చెందిన పసుపులేటి నిశాంత్ అనే యువకుడిని, అబ్దుల్ మరి కొంతమంది యువకులు కొరిటెపాడుకు పిలిపించి అమ్మాయితో మాట్లాడవద్దని గొడవ పెట్టుకుని కర్రలతో దాడి చేశారు. గాయపడిన నిశాంత్‌ను స్థానికులు జీజీహెచ్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలి



లక్ష్మీపురం: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో విద్యార్థులతో కొత్తపేట భగత్ సింగ్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న రూ.6400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారం, యువగళం పాదయాత్రలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత తుతూ మంత్రంగా కేవలం రూ.600 కోట్లు విడుదల చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. జూలై 11న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి యశ్వంత్, డేవిడ్, అమర్నాథ్, కిరణ్, గణేష్, అజయ్, నగర నాయకురాలు జ్యోతిక పాల్గొన్నారు.

మహిళలకు స్ఫూర్తి సూర్యావతి

లక్ష్మీపురం: బ్రాడీపేట ఐద్వా కార్యాలయంలో మహిళా ఉద్యమ నేత ఆదర్శ కమ్యూనిస్టు మానికొండ సూర్యావతి వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి కె.పద్మ అధ్యక్షతన వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ పూలమాల వేసి నివాళులర్పించారు. పీడిత ప్రజల విముక్తి కోసం అలుపెరగని పోరాటం చేయటమే సూర్యావతి ఇచ్చే ఘన నివాళి అన్నారు. కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి ఎ.కళ్యాణి, అధ్యక్షులు జి.రమణ. కే పద్మ, నందిని, తిరుపతమ్మ, అంకమ్మ, శివమ్మ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు వెస్ట్)
9912220356
Office mail : sakshigntadvt@gmail.com

విద్యార్థుల జీవితాలతో చెలగాటం...

- పరిమితికి మించి ప్రయాణం...
- ఇబ్బడి ముబ్బడిగా ఆటోల్లో విద్యార్థుల తరలింపు
- తూతూ మంత్రంగా ఆర్టీఏ, ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు



ఆటోలో ముందు పక్క విద్యార్థులను కూర్చొ పెట్టుకుని తీసుకుని వెళుతున్న దృశ్యం

పట్నంబజారు: విద్యాసంస్థలు పునఃప్రారంభ య్యాయి. నగరంలో విద్యార్థుల సందడి మొదలైంది. కొన్ని విద్యాసంస్థలు ప్రత్యేక రవాణా వాహనాలు ఏర్పాటు చేసుకున్నాయి. కానీ కొందరు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇదే తరుణంలో విద్యార్థుల జీవితాలతో ఆటోవాలలు చెలగాటమాడుతున్నారు. ఇబ్బడి ముబ్బడిగా ఆటోల్లో ఎక్కిస్తున్నారు. కనీసం ముందు సీటులో కూర్చొపెట్టకూడదన్న నిబంధనలు ఉన్నా.. ఏ మాత్ర ఖాతరు చేయటం లేదు. నిత్యం విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీసులు.. అధిక లోడు ఎక్కిస్తే చర్యలు తీసుకోవాల్సిన ఆర్టీవో అధికారులు చోద్యం చూస్తున్నారు.

విద్యార్థుల తరలింపు ఇలా...

జిల్లాలో 30 వేల వరకు ఆటోలు ఉన్నాయి. నగరంలోనే 18 వేల వరకు తిరుగుతున్నాయి. వీటిలో సుమారు 4వేల వరకు నిత్యం విద్యార్థులను పాఠశాలలు, కళాశాలలకు తరలించే ఆటోలు ఉంటాయని అంచనా. విద్యార్థులను తరలించే ఆటోలకు ఎటువంటి అనుమతులు తీసుకోవటం లేదు. తల్లిదండ్రులు విద్యాసంస్థల ఫీజులు భరించలేక, కొంత మంది పనుల నిమిత్తం, వివిధ కారణాల నేపథ్యంలో ఆటోల్లో వారి పిల్లలను విద్యాలయాలకు పంపిస్తున్నారు. ఆటోలో సిట్టింగ్‌ను బట్టి విద్యార్థులను తరలించాల్సిన ఆటోవాలలు పరిమితికి మించి తరలిస్తున్న పరిస్థితులు స్పష్టంగా కనపడుతున్నాయి. ఇటీవల కాలంలో కేవలం గుంటూరు ఈస్ట్ సబ్‌డివిజన్‌లో మాత్రమే పది ఆటోలపై కేసులు నమోదు చేశారు. నలుగురు నుంచి ఐదుగురిని ఎక్కించాల్సిన ఆటోవాలలు 10 మంది వరకు ముందు, వెనుక భాగాల్లో కూర్చొపెట్టి మరీ ప్రయాణం చేస్తున్నారు. పాఠశాల విద్యార్థులకు అయితే ఐదో తరగతి లోపు రూ.3000, 10వ తరగతి వరకు రూ.4000, కళాశాల విద్యార్థులకు రూ.5వేలకు పైగానే ఆటోవాలలు నెలలకు బాడుగ తీసుకుంటున్నారని చెబుతున్నారు.

ఇవిగో ఘటనలు....

నాలుగు రోజుల క్రితం ఒక ఆటోవాలా తన ఆటోలో విద్యార్థులను ముందు వైపు అటు పక్క ఇద్దరిని.. ఇటు పక్కన ఇద్దరిని కూర్చొపెట్టుకుని వెళుతున్నాడు. ఈ క్రమంలో ఒక ద్విచక్ర వాహనదారుడు ఎదురుగా వస్తూ.. విద్యార్థికి బండి తగలటంతో ఆ విద్యార్థి కింద పడ్డాడు. స్వల్పగాయాలు కావటంతో సరిపోయింది. ఇటువంటి ఘటనే ఫిరంగిపురం మండలం వేమవరం వద్ద చోటుచేసుకుంది. విద్యార్థులను తీసుకెళ్తూ.. ఆర్టీసీ బస్సులు ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న ఎనిమిది మంది విద్యార్థులు మృత్యువాత పడ్డ ఘటన కళ్ల ముందు కదులుతూనే ఉంది.

తనిఖీలు చేపడతాం..



విద్యార్థులను ఆటోల్లో పంపించే తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. అధికంగా ఎక్కిస్తే ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించవద్దు. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. ప్రత్యేక తనిఖీలు నిర్వహించేందుకు దృష్టి సారిస్తున్నాం. పరిమితికి మించి తరలిస్తే.. కేసులు నమోదు చేయటం, జరిమానాలు విధించటం, ఆటోలు సీజ్ చేస్తాం. చిన్నారుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకోవాలి. లేని పక్షంలో చట్టబద్ధంగా ఆటోలపై చర్యలు తీసుకుంటాం.

– కె.సీతారామిరెడ్డి, డీటీసీ, గుంటూరు జిల్లా

స్పెషల్ డ్రైవ్‌లు ప్రారంభించాం



విద్యార్థులను ఆటోల్లో తరలిస్తున్న అంశంపై ఇప్పటికే దృష్టి సారించాం. ఆటోల్లో ముందు పక్కన డ్రైవర్‌కు రెండు వైపులా కూడా కూర్చొపెట్టి తీసుకుని వెళ్తుండాన్ని పరిశీలించాం. కచ్చితంగా అటువంటి ఆటోవాలలపై చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఈస్ట్, వెస్ట్ సబ్‌డివిజన్‌ల పరిధిలో అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. దీనితో పాలటుగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని నిర్ణయించాం.

–ఎం.రమేష్, డీఎస్పీ, ట్రాఫిక్, గుంటూరు

ముగిసిన సచివాలయ బదిలీల ప్రక్రియ

నెహ్రూనగర్: గుంటూరు ఉమ్మడి జిల్లా పరిధిలో వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల ప్రక్రియ ముగిసింది. వార్డు అడ్మిన్ సెక్రటరీలు, వార్డ్ ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీలకు సంబంధించి బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తూ ఆర్‌డీఎంఏ(రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్) ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో బదిలీల ప్రక్రియ అంతా కూడా నగరపాలక సంస్థ అధికారులే బదిలీలు ప్రక్రియ చేపట్టి తూతూ మంత్రంగా సంబంధించి శాఖ అధికారులకు బదిలీలకు సంబధించిన ప్రక్రియ పంపి వాటినే తిరిగి ఇచ్చే విధంగా చేయించుకున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరపాలక సంస్థ 207 వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సచివాలయ ఉద్యోగులకు వారు కోరుకున్న మూడు సచివాలయాలను ఆప్షన్స్‌గా ఇచ్చుకున్నారు. అయితే వీరిలో చాలా మందికి ఇచ్చిన ఆప్షన్స్ కాకుండా అసలు ఆప్షన్ ఇవ్వని సచివాలయాలను కేటాయించబడంపై పలువురు మండిపడుతున్నారు. మెడికల్ గ్రౌండ్స్ కింద ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉండగా దానికి పాతర వేసి వారు ఇవ్వని ఆప్షన్ సచివాలయం కేటాయింపుపై మండిపడుతున్నారు.

విదేశాల్లో ఉన్న వారికి పోస్టింగ్ ఉన్నట్లు చూపించారు?

2019లో గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో విధుల్లో చేరిన వార్డు ఎమినిటీ సెక్రటరీల్లో ఇద్దరు, ముగ్గురు విదేశాల్లో జాబ్‌లు చేసుకుంటూ సెటిల్ అయ్యారు. వారు సుమారు మూడు, నాలుగు సంవత్సరాలకుపై బడి విధులకు గైర్హజరైనప్పటికి బదిలీల లిస్ట్‌లో నో కేటగిరి కింద చూపిస్తూ ఉత్తర్వులు ఇవ్వడంతో కొంత మంది ఎమినిటీ సెక్రటరీలు కంగుతిన్నారు. గుంటూరు రూరల్ పరిధిలోని ఓ సచివాలయంలో విధులకు మూడు సంవత్సరాలకు పైబడి విధులకు హాజరు కాకుండా ఓ ప్రైవేట్ ఉద్యోగం చేసుకుంటున్నప్పటికి కూడా అతని పేరు ఎస్ ఉన్న కేటగిరిలో కేటాయించి.. విధుల్లో ఉన్న వారిని నో కేటగిరిలో చూపించడంపై పలువురు ఉద్యోగులు అధికారులు బదిలీల ప్రక్రియలో ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

పారిశుద్ధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరంలో ఈనెలాఖరు నాటికి ప్రజలు మెచ్చేలా పారిశుద్ధ్యాన్ని మెరుగుపరిచేందుకు నగర పరిధిలోని 3 నియోజకవర్గాల వారీగా ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి, పశ్చిమ నియోజకవర్గంలో కార్పొరేటర్లు, ప్రజారోగ్య కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లతో పారిశుద్ధ్యం మెరుగు కోసం ప్రత్యేక సమీక్ష సమావేశం జరిగింది. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ సీహెచ్.శ్రీనివాస్, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్‌ఓలు(ఇన్‌ఛార్జ్) సోమశేఖర్, ఎస్ఎస్‌లు ప్రసాద్, రాజేష్, కార్పొరేటర్లు, ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి ఎమ్మెల్యే గల్లా మాధవి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అన్నా క్యాంటీన్ పరిశీలన

అన్నా క్యాంటీన్లలో మౌలిక వసతులపై నోడల్ అధికారులు దృష్టి సారించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

నగరపాలక సంస్థ పరిధిలో నూతనంగా నిర్మాణం చేసే డ్రెయిన్లు, రోడ్ల నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శుక్రవారం కమిషనర్ బందావన్ గార్డెన్స్, పండరీపురం, విద్యా నగర్, అమరావతి రోడ్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. పర్యటనలో ఏసిపి రెహ్మాన్, డిఈఈ రమేష్ బాబు, ఎస్ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

స్నేహ బాంధవుడు డాక్టర్ వైఎస్సార్

విశ్రాంత ఐఏఎస్ అధికారి ప్రభాకర్‌రెడ్డి



గుంటూరు ఎడ్యుకేషన్: మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి స్నేహానికి ప్రాణమిచ్చేవారని, స్నేహానికి ఎన్నడూ లోటు రానివ్వలేదని వైఎస్సార్ వ్యక్తిగత కార్యదర్శిగా పని చేసిన విశ్రాంత ఐఏఎస్ అధికారి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గుంటూరులోని అవర్ స్టేట్.. అవర్ లీడర్– ఇండియన్ ఇంటిలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు జి.శాంతమూర్తి ఆధ్వర్యంలో మహానేత డాక్టర్ వైఎస్సార్ జయంతి వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం గొప్ప జ్ఞాపకాలు శీర్షికతో వెబినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ 1975లో రాజకీయ రంగ ప్రవేశం చేసిన వైఎస్సార్ 29 ఏళ్ళ వయస్సులోనే ఎమ్మెల్యేగా గెలిచారని వివరించారు. కేవీపీ, సాయిప్రతాప్‌తో ఆయన స్నేహం ప్రభుత్వాలకు, పార్టీలకు అతీతమైనదని, కులం అనే అడ్డుగోడ కేవీపీ, వైఎస్సార్‌ల మధ్య లేదని అన్నారు. రాష్ట్ర రాజకీయాలను మార్చివేసిన వైఎస్సార్ పాదయాత్ర స్నేహితుల సహకారంతో విజయవంతంగా సాగిందని, తమను ఆశ్రయించిన వారికే కాకుండా మిత్రులకు అండదండగా ఉన్నారని కొనియాడారు. ఎంవీఎస్ వాసిరెడ్డి మాట్లాడుతూ 2004లో వైఎస్సార్ సీఎం అయిన తరువాత వారి కార్యాలయంలో కలిసి వ్యవసాయానికి అవసరమైన నీటి వనరుల గురించి ఇచ్చిన వినతి పత్రాన్ని స్వీకరించి ఆ విషయాన్ని అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ దృష్టికి తీసుకెళ్లారని, ప్రజలు, రైతులు, నాయకులు, కార్యకర్తలపై వైఎస్సార్‌కు గల నిబద్ధతకు ఇదొక నిదర్శనమని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటెపాడు: రోడ్డు విస్తరణలో భాగంగా విద్యుత్ సరఫరా శనివారం నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.గురవయ్య శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. ఎస్వీఎన్ కాలనీ, జేకేసీ కాలేజ్ రోడ్, తారక రామ నగర్, రెడ్డిపాలెం సబ్ స్టేషన్, మల్లికార్జున పురం, అన్నపూర్ణ నగర్, భాష్యం టాటానిక్, ఇన్నర్ రింగ్ రోడ్, రెడ్డిపాలెం, శారద కాలనీ, మల్లికార్జున పేట ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

గుంటూరు –2 సబ్ స్టేషన్ పరిధిలో రోడ్డు వెడల్పు పనులు, లైన్ మెయింటనెన్స్ కోసం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పట్టాభిపురం, ఫాతిమాపురం తదితర ప్రాంతాల సరఫరా ఉండదని చెప్పారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పైరసీ గుప్పిట్లో చిత్ర పరిశ్రమ

నగరంపాలెం: చిత్ర పరిశ్రమను పైరసీ భూతం పట్టిందని, గత ఏడాదిలో రూ.3,700 కోట్ల నష్టాన్ని మిగిల్చిందని మా–ఏపీ వ్యవస్థాపకులు, చిత్ర దర్శకులు దిలీప్‌రాజా అన్నారు. శుక్రవారం గుంటూరు నగరంలోని ఓ హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. పైరసీ కారణంగా వేల కోట్ల రూపా యలు నష్టం వాటిల్లుతుందని అన్నారు. పైరసీపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధప్రతిపాదికన చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఉన్నత వ్యక్తిత్వానికి ప్రతీక మాధవ పెద్ది

వరల్డ్ ఎకనామిక్ ఫోరం అడ్వైజర్ జి.సత్యనారాయణ



మాట్లాడుతున్న సత్యనారాయణ

గుంటూరు ఎడ్యుకేషన్: హిందూ కళాశాల పాలకమండలి అధ్యక్షుడిగా, న్యాయవాదిగా, ఆధ్యాత్మిక తత్వవేత్తగా, కర్మ, జ్ఞాన, భక్తి యోగాలను ఆచరణాత్మకంగా ఆచరించి చూపిన గొప్ప మానవతామూర్తి మాధవ పెద్ది రాధాకృష్ణమూర్తి అని వరల్డ్ ఎకనామిక్ ఫోరం అడ్వైజర్ జి.సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం హిందూ కళాశాల సమావేశ మందిరంలో కళాశాల పూర్వ అధ్యక్షుడు మాధవ పెద్ది రాధాకృష్ణమూర్తి శత జయంత్యుత్సవాలను ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం సభకు హిందూ కళాశాల, హైస్కూల్ అధ్యక్షులు గబ్బిట శివరామకృష్ణ అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, కళాశాల పూర్వ కార్యదర్శి డాక్టర్ ఎం. రాధాకృష్ణమూర్తి, కరస్పాండెంట్ రామకృష్ణమూర్తి మాట్లాడారు. కళాశాల అభివృద్ధికి రాధాకృష్ణమూర్తి కుటుంబ సభ్యులు ఐదు లక్షల విరాళాన్ని అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, జూపూడి రంగరాజు, కౌన్సిల్ కార్యదర్శి కేఎస్ఆర్ కుటుంబరావు, ఎంవీఆర్‌కే ముత్యాలు, మాధవపెద్ది మీరా శేఖర్, రమణి ప్రసాద్, చైతన్య, అపర్ణ పాల్గొన్నారు.

నిరసనలపై ఆంక్షలు ఎత్తివేయాలి

లక్ష్మీపురం: పోలీసులు జిల్లాలో విధించిన 30 యాక్టు ఎత్తివేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. బ్రాడీపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో నాయకులు శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ జిల్లాలో సభలు, సమావేశాలు, ర్యాలీలు, ఊరేగింపులు, నిరసనలు, బంద్‌లు నిర్వహించుకునేవారు పోలీసువారి నుంచి వారం రోజులు ముందుగా పోలీసుల అనుమతి తీసుకోవాలని చెప్పడం సమంజసం కాదన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 నుంచి 19 వరకు వాక్, సభాస్వాతంత్ర హక్కులను కాలరాయడం అవుతుందన్నారు. న్యాయస్థానాల తీర్పుల స్ఫూర్తికి విరుద్ధంగా ప్రజల నిరసన తెలిపే హక్కును విఘాతం కల్పించే విధంగా గుంటూరు జిల్లా పోలీసుల ప్రకటన వుందని చెప్పారు. యాక్టును పోలీసులు ఉపసంహరించుకోవాలని, ప్రజల నిరసన తెలిపే ప్రజాస్వామిక హక్కును పరిరక్షించాలని కోరారు. సమావేశంలో సీపీఐ (ఎంఎల్) రెడ్ స్టార్ రాష్ట్ర నాయకుడు మన్నవ హరిప్రసాద్, సీపీఐ(ఎంఎల్) ప్రజాపోరు నాయకుడు రవికుమార్, సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పాశం రామారావు పాల్గొన్నారు.

జాతీయ పతాక రూపశిల్పి పింగళికి నివాళి



మాట్లాడుతున్న నటుడు పీసీహెచ్ నాయుడు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై శుక్రవారం రాత్రి దివంగత పింగళి వెంకయ్య వర్ధంతి సభ నిర్వహించారు. నటనాలయ అధ్యక్షులు నీలం మందారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ పాలకమండలి ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సభకు రంగస్థల ఆచార్యులు డాక్టర్ జి.ఎస్.ప్రసాద్‌రెడ్డి అధ్యక్షత వహించారు. పింగళి వెంకయ్య జాతీయ పతాకాన్ని రూపకల్పన చేయడమే కాకుండా, పలు రంగాల్లో ఆయనకున్న ప్రతిభను తెలియజేశారని వక్తలు పేర్కొన్నారు. ప్రముఖ దర్శకులు పి.శివప్రసాద్, ఎం.గౌతమ్, సీఐడీ గుంటూరు డీఎస్పీ గోలి లక్ష్మయ్య, రచయిత సీఎస్ మూర్తి, నటులు పీసీహెచ్ నాయుడు, కె.అనంతహృదయ రాజ్, ఆలయ పాలక మండలి అధ్యక్షులు సీహెచ్.మస్తానయ్య, కూచి రామాంజనేయులు, ఎం.సత్య నారాయణ, జి.రాజు, విద్యావేత్త పి.శశికుమార్ మాట్లాడారు. అనంతరం నెల్లూరు సుధాకర్ దర్శకత్వం వహించగా, డాక్టర్ పీర్‌కుమార్‌బద్రి రచించిన వంశవృక్షం (శ్రీపొట్టిశ్రీరాములనెల్లూరు జిల్లా) నాటిక సందేశాత్మకంగా కొనసాగింది. కార్యక్రమంలో కేవీ రామారావులను సత్కరించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదంచేయండి

లక్ష్మీపురం: కేంద్ర ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా 9న నిర్వహించనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ గుంటూరు నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ఐరన్ ముఠా కార్మికుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఐరన్ విభాగ నాయకులు మల్లెబోయిన పిచ్చయ్య, రత్నబాబు, శ్రీహరి, వెంకటేష్, శీను, కోటయ్య పాల్గొన్నారు.

సీఐటీయూ కార్యాలయంలో..

లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఈనెల 9న చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ పిలుపునిచ్చారు. గుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం బి.లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించారు. షేక్ మస్తాన్‌వలి మాట్లాడారు.

వివాహిత ఆత్మహత్య కేసులో రౌడీ షీటర్ అరెస్ట్

లక్ష్మీపురం: వివాహిత ఆత్మహత్య కేసులో భర్తను పట్టాభిపురం పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు.. గుంటూరు రాజీవ్‌గాంధీ నగర్ ప్రాంతానికి చెందిన పాలిపోగు శ్రీను, అదే ప్రాంతానికి చెందిన కీర్తన 2025లో ప్రేమ వివాహం చేసుకున్నారు. సెప్టెంబర్ 20వ తేదిన జరిగింది. అనంతరం బ్రాడీపేటలోని 4,/19వ లైన్‌లో నివాసం ఉంటున్నారు. మనస్పర్ధలతో భార్య కీర్తనను శారీరకంగా, మానసికంగా వేధించడం ప్రారంభించాడు. జూన్ 26వ తేదీన ఇంట్లో గదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. శ్రీనుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలు కీర్తన తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పాలిపోగు శ్రీను గురించి విచారించగా గతంలో శ్రీను పై అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో 6 కేసులు నమోదు అయి ఉండగా అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్నట్లు గుర్తించారు. దీంతో శుక్రవారం పాలిపోగు శ్రీను పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

జేకేసీ కళాశాలలో విపత్తుల నిర్వహణపై మాక్‌డ్రిల్

గుంటూరు ఎడ్యుకేషన్: జేకేసీ కళాశాలలో శుక్రవారం జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో విపత్తు నిర్వహణపై మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈసందర్భంగా విజయవాడకు చెందిన ఎన్‌డీఆర్ఎఫ్ 10వ బెటాలియన్ టీం కమాండర్ ప్రదీప్‌కుమార్ పర్యవేక్షణలో టీం సభ్యులు నరేంద్ర యాదవ్, వాసుదేవ యాదవ్‌తో కూడిన 10 మంది డెమో నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్ వైస్ చైర్మన్ పి.నాగసుశీల, వీఆర్వో సీహెచ్ శోభారాణి, డాక్టర్ రాహుల్, అజయ్‌బాబు, చరణ్‌చౌదరి, వెంకటకృష్ణ, డాక్టర్ ప్రశాంతి పర్యవేక్షించారు.

ఘనంగా అల్లూరి సీతారామరాజు జయంతి

గుంటూరు ఎడ్యుకేషన్: అల్లూరి పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వర రెడ్డి పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో శుక్రవారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక మాట్లాడారు. కార్యక్రమంలో డీఈఓ అసిస్టెంట్ డైరెక్టర్ శైలజ, సూపరింటెండెంట్ జగదీష్ అగర్వాల్ పాల్గొన్నారు.

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో..

లక్ష్మీపురం: అల్లూరి సీతారామరాజు జయంతి శుక్రవారం నిర్వహించారు. అవగాహన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. నాజ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమానికి సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అచ్యుత ఇందుశేఖర్, ఇ.చంద్రయ్య, ఆర్.వి.సింగరయ్య, ఎన్.సదాశివం, రాఘవరావు, సుబ్బారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ కార్యాలయంలో...

నగరంపాలెం: జిల్లా పోలీస్ కార్యా లయ ఆవరణలో అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఏఎస్పీ (పరిపాలన) రమణమూర్తి, జిల్లా ఏఎస్పీ(ఏఆర్) హనుమంత్, ఏఓ అద్దంకి వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్‌లు రమాదేవి, సుభాషిణి, ఆర్ఐలు శ్రీహరిరెడ్డి, శివరామకృష్ణ, సురేష్ పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ For Medical and Engineering Management Seats AP, Telangana, Tamilnadu, Karnataka. and aboard. 99661 34446.

REAL ESTATE
FLAT FOR SALE
■ గుంటూరు సిటీ, పట్టాభిపురం NCC Park Square Project గేటెడ్ కమ్యూనిటీ అపార్ట్మెంట్ నందు 100% వాస్తుతో, అత్యంత నాణ్యతా ప్రమాణాలతో నిర్మించిన 4,607 చ.అ.ల 5 BHK ప్రీమియం ఫుల్లీ ఫర్నిష్డ్ ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు. సంప్ర: 81211 42332

LAND FOR SALE
■ GNT నందివెలుగు రోడ్డు మెయిన్ రోడ్డు అనుకొని 140 చ.గ. ఖాళీ స్థలం వేంకటేశ్వర స్వామి గుడి ఎదురు ఉత్తర ఫేసింగ్‌తో అమ్మబడను. సంప్ర: 7680899937, 8328565074

PLOT FOR SALE
■ నందనవనం @ చిలకలూరిపేట 500 గజాల స్థలము 3BHK ప్రీమియం విల్లాలు అన్ని సౌకర్యాలతో కేవలం 39లక్షల రూపాయలు మాత్రమే సంప్రదించండి. 7702787797, 9700565357

SERVICES
BUSINESS OFFER
■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందండం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి :7406393937

GOLD FINANCE
■ బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999

HEALTH CARE
■ మీ ఇంట్లో నుండే అధిక బరువును (లావు)తగ్గించుకోండి/ పెంచుకోండి చాలా సులభంగా, సురక్షితంగా శాస్త్రీయంగా మీ శరీరానికి కావలసిన సమతుల్యమైన ఆహారం లభించును. ✆ 90147 56524

WANTED
■ Wanted B-Pharmacy / D-Pharmacy candidates to work in a pharmacy in guntur pci registration mandator packing/Delivery boys. 6300975241
■ బిజినెస్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ, 3 సం॥ల మార్కెటింగ్ రంగంలో అనుభవం, 30 సం॥ లోపువారు రెజ్యూములను kamathamjob@gmail.com కు పంపగలరు.
■ గుంటూరు నగరంలో ప్రముఖ స్కూల్లో Classical Dance, Western Dance, Chess Masters & Primary Tachers కావలెను. ✆ 9447660603
■ P/T, F/T 18సం॥ నిండిన ఉత్సాహవంతులైన యువతి యువకులు కావలెను. భవిష్యత్తు నిర్మాణం నో టార్గెట్స్ నో బాస్. 9010803546
■ ఫ్రీ కంప్యూటర్ M.S Office, Spoken English కోర్సు 3 నెలల శిక్షణ ఇచ్చి ఉపాధి చూపబడును. ఫ్రీ భోజనం హాస్టల్, 10th, ఇంటర్, డిగ్రీ, 18-28సం॥లోపు. 9133444988/ 89
■ NR Development companyకి మార్కెటింగ్ స్టాఫ్ మరియు మార్కెటింగ్ ఏజెంట్లు కావలెను. గృహిణులకు రిటైర్డ్ ఎంప్లాయిస్ కి ప్రాధాన్యత ఇవ్వబడును. 7702787797, 9700565357
■ B.Ed చేసిన అనుభవం గల టీచర్స్ తెలుగు, మాథ్స్, ఇంగ్లీష్ & సోషల్ సబ్జెక్ట్స్ E.M బోధించుటకు కావలెను. 8886827278, 8886827279
■ గుంటూరులో 100బెడ్స్, ఆయుర్వేదిక్ హాస్పిటల్ లో పనిచేయుటకు 18-30 సం॥ 10th-MBA అర్హత గల M/F కావలెను. జీతం: 15,000వరకు. 9440870099
■ శ్రీను డిజిటల్స్ తెనాలి నందు పని చేయుటకు తెలుగు టైపింగ్ మరియు ఫోటోషాప్ నందు అనుభవం గల M/F కావలెను. ఆకర్షణీయమైన జీతం : సంప్ర॥ 9959595927, 9393985766
■ చీరాల్ బీపీసీఎల్ పెట్రోల్ బంక్ నందు పనిచేయుటకు పంపు బాయ్స్ కావలెను. మంచి జీతం. ఎస్.ఎస్.ఏజెన్సీస్, Opp. రైల్వేస్టేషన్, చీరాల. సంప్రదించండి. సెల్ : 94419 01059.
■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838
■ ప్రముఖ బ్యాంకింగ్ రికవరీ ఏజెన్సీ Gunturలో Field Executives కావలెను. Salary 15K & 20K + Incentives ✆ 72079 42933
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ : 18K. Ph: 9640400073, 9160900024

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ప్యాక్ రూ.475/- మాత్రమే (4లైన్లు)
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం
గుంటూరు
7075167663
7075167541

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.